క్లుప్తంగా

బాలికావిద్య ప్రాధాన్యం గుర్తించండి

దావాజిగూడెం(గన్నవరం): మండలంలోని దావాజిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జె.సత్యవాణి మాట్లాడుతూ బాలికల విద్యకు ఉన్న ప్రాధాన్యతను గుర్తించి ప్రోత్సహించాలని చెప్పారు. బాల్య వివాహాల నియంత్రణకు అందరూ కలిసి రావాలని కోరారు. చిన్న వయస్సులోనే ఆడ పిల్లలకు పెళ్లి చేయడం వల్ల అనారోగ్యం, మానసిక సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుందన్నారు. పాఠశాల హెచ్‌ఎం కె.ప్రేమావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు అచ్చియమ్మ, ఖాదర్ బీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ



ఉయ్యూరు: పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ అన్నారు. శ్రీ శ్రీనివాసా అక్షరాలయం సీబీసీఈ పాఠశాల విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతపై శుక్రవారం అవగాహనార్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన చైర్మన్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని మానుకోవాలన్నారు. హరితభూమికి రక్షకులుగా మారాలని కోరారు. కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత డాక్టర్ పరుచూరి శ్రీనివాసరావు, డైరెక్టర్ పరుచూరి నీలిమ, ఏఓ సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన వైజ్ఞానిక ప్రదర్శన

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరు ఢిల్లీపబ్లిక్‌స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన పలువురును ఆలోజింపజేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుండె వైద్య నిపుణులు డాక్టర్ అమర్త గణేష్ హాజరై ప్రారంభించారు. పాఠ్యాంశాల వారీగా పలు నమూనాలను తయారు చేసి విద్యార్థులు ప్రదర్శిం వీక్షకుల మన్ననలు పొందారు. గుండె వైద్య నిపుణులు అమర్త గణేష్ విద్యార్థులు ప్రదర్శించిన వైజ్ఞానిక ప్రదర్శన వీక్షించి అభినందించారు. పర్యావరణ పరిరక్షణకు మన వంతు కృషి చేయాలన్నారు. అనంతరం ఉత్తమ నమూనాలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. అకడమిక్ డైరెక్టర్ డేవిడ్ రాజు, ప్రొవైస్ చైర్మన్ పరిమి నరేంద్రబాబు, డైరెక్టర్ పవన్ చంద్, ప్రిన్సిపాల్ భువనేశ్వరన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కంకిపాడు: అంతర్జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకుని కంకిపాడు జెడ్పీ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు ఆధ్వర్యంలో బాలికల విద్య, హక్కులు, లింగ వివక్షతపై వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. పోటీల్లో బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సీడీపీఓ కె.బేబి సుకన్య మాట్లాడుతూ బాలికలు అన్నింటా ముందుండాలన్నారు. బాల్య వివాహాలను నిరోధించాలని, బాలికలకు విద్య సమర్థంగా అందేలా చూడాలని సూచించారు. సూపర్‌వైజర్ ఎస్.అన్నామణి, ఇన్‌చార్జి హెచ్‌ఎం నాగేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు నళిని, రత్న, లక్ష్మి, కృష్ణవేణి, దుర్గ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు సైకిల్ పోటీలు నిర్వహించి, విజేతలను అభినందించారు.

డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన

పెనమలూరు: పోరంకి- నిడమానూరు రోడ్డు డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ రూ.33 లక్షలతో డ్రెయినేజీ పనులు చేస్తామన్నారు. నిడమానూరు రోడ్డులో మురుగునీరు పారుదలలో సమస్య ఉన్నందున డ్రెయినేజీ నిర్మాణం చేపట్టామని అన్నారు. ఇప్పటికే రోడ్డుకు ఒక పక్క డ్రెయినేజీ పనులు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్, తాడిగడప టీడీపీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, కూటమి నేతలు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం సూపర్ జీఎస్టీ 2.0ను అమలులోకి తీసుకు రావటంతో గృహోపకరాల ధరలు తగ్గాయని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పోరంకిలో ఎలక్ట్రానిక్ ఉత్సవ్‌ను ఆయన ప్రారంభించి ప్రసంగించారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మేలు

ఉయ్యూరు: జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు నేరుగా లాభం చేకూరుతుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. జీఎస్టీ స్టేట్ ట్యాక్స్ ఉయ్యూరు సర్కిల్ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ, సూపర్‌సేవింగ్స్, ఎలక్ట్రానిక్స్ ఉత్సవ్ కార్యక్రమం శుక్రవారం ఆర్యవైశ్య ప్రార్థనామందిరంలో నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి జీఎస్టీ తగ్గింపుతో కలిగేమేలు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, జీఎస్టీ అడిషనల్ కమిషనర్ బాలాజీ బాబు, జాయింట్‌కమిషనర్ కల్పన, డీసీటీఓ స్వరూపారాణి, ఎంపీడీఓ శేషగిరిరావు, వివిధ రంగాలకు చెందిన వ్యాపారులు పాల్గొన్నారు.

అన్నింటా కోతలే.. అభివృద్ధి ఇదేనా?

- మద్దూరు–గోసాల రోడ్డుకు రూ.4 కోట్లు విడుదల
- రూ.6.50 కోట్లతో అంచనాలు
- నిధుల విడుదలలో కోత
- రోడ్డు నిర్మాణంపై ప్రజల్లో ఆందోళన



అధ్వానంగా ఉన్న మద్దూరు-గోసాల రోడ్డు మార్గం

కంకిపాడు: కూటమి ప్రభుత్వ పాలన కోతలమయంగా మారింది. మొన్నటి వరకూ ప్రచారంలో సర్కారు కోతలు కోసింది. నేడు అభివృద్ధి పనులకు విడుదల చేసే నిధుల్లోనూ భారీగా కోత విధించటంతో ఇదెక్కడి అభివృద్ధి..ఇదెలా సాధ్యం..అంటూ ప్రజలు ముక్కున వేలు వేసుకుంటున్నారు. ఇందుకు మద్దూరు–గోసాల రోడ్డుపై ప్రభుత్వం సారించిన దృష్టి నిలువుటద్దంగా నిలుస్తుంది. విజయవాడ–దివిసీమ కరకట్ట రోడ్డు మార్గం నుంచి మద్దూరు,వణుకూరు, గోసాల మీదుగా విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిని కలుపుతూ ఉన్న ప్రధాన రోడ్డు మార్గం మద్దూరు–గోసాల రోడ్డు. కొన్నేళ్లుగా ఈ రోడ్డు మార్గం గోతులమయంగా మారి, మార్జిన్‌లు కోతకు గురై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్న పాటి వర్షం కురిసినా నీరు నిలిచిపోయి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మొన్నటి వరకూ ఇసుక రీచ్‌ల నుంచి భారీ లోడు వాహనాలు ఈ మార్గం గుండానే రాకపోలు సాగించటంతో రోడ్డు మరింతగా గోతులు పడి అధ్వానంగా మారింది. కేవలం ఇసుక రవాణాకు ఆటంకం ఏర్పడుతుందనే భావనతోనే ఈ రోడ్డు అభివృద్ధి అంశాన్ని పక్కన పెట్టేస్తూ వచ్చారనే ఆరోపణలు కూడా లేకపోలేదు. నిత్యం నరకం అనుభవిస్తూ ప్రజలు ఈ మార్గం గుండా రాకపోకలు సాగించాల్సి వస్తోంది. గోతులు కారణంగా వాహనాలు మరమ్మతులకు గురై ఇబ్బందులు పడుతున్నారు.

రూ.4 కోట్లతో అభివృద్ధి ఎలా?

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో ముందుచూపుతో మద్దూరు నుంచి గోసాల మీదుగా ఉప్పలూరు వరకూ ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గాన్ని అభివృద్ధి చేయటంతో పాటుగా ప్రజల అవసరార్థం రోడ్డు విస్తరణకు ప్రతిపాదించింది. డబుల్ లైన్‌గా రోడ్డును అభివృద్ధి చేసేందుకు రూ.19.50 కోట్లు నిధులు కేటాయించింది. ఎన్నికల కోడ్‌కు ముందు శంకుస్థాపన పనులు జరిగాయి. కోడ్ అమలులోకి రావటంతో పనులు ముందుకు సాగలేదు. తదుపరి అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు గత ప్రభుత్వంలో మంజూరైన పనులను రద్దు చేసింది. ఇందులో భాగంగానే మద్దూరు–గోసాల–ఉప్పలూరు పనులకు కూడా బ్రేక్ పడింది.

పెడచెవిన ప్రతిపాదనలు....

విజయవాడ–మచిలీపట్నం రోడ్డు నుంచి ఈడుపుగల్లు మీదుగా ఉప్పలూరు వంతెన వరకూ రోడ్డు మార్గం అభివృద్ధికి రూ 3.50 కోట్లు కేటాయింపులు జరిగాయి. తాజాగా మద్దూరు–గోసాల రోడ్డు అభివృద్ధికి రూ.4 కోట్లు కేటాయింపులు జరిగాయి. అయితే అధికారులు మాత్రం రూ 6.50 కోట్లతో రోడ్డు సింగిల్ లైన్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించారు. సర్కారు మాత్రం ప్రతిపాదనలు పెడచెవిన పెట్టి రూ.4 కోట్లు కేటాయించింది. దీంతో ఈ నిధులతో రోడ్డు అభివృద్ధి ఎలా సాధ్యమన్న ప్రశ్న ఆయా గ్రామాల ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ప్రస్తుతం రోడ్డు ఉన్న పరిస్థితికి ఈ నిధులు ఏ మాత్రం సరిపోవన్న వాదన సర్వత్రా వ్యక్తమవుతుంది. సర్కారు అనాలోచిత నిర్ణయంతో అభివృద్ధి పనులు సవ్యంగా సాగేనా? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. కనీసం ప్రతిపాదనలకు కూడా ప్రభుత్వం అంగీకారం తెలపకపోవటంతో రోడ్డు నిర్మాణం, అభివృద్ధి, నాణ్యతపై సందేహాలు బాహాటంగానే వ్యక్తమవుతున్నాయి.

ఆరోగ్యశ్రీ కౌంటర్‌లో రిజిస్ట్రేషన్లు నిలిపివేత



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ఆరోగ్యశ్రీ అమలు చేస్తున్న నెట్‌వర్కు ఆస్పత్రులకు ప్రభుత్వం బిల్లులు బకాయి చెల్లించకపోవడటంతో శుక్రవారం రోగులకు ఉచిత వైద్య సేవలు అందలేదు. దీంతో ఆయా ఆస్పత్రులకు వెళ్లిన రోగులు చాలా ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్ వైద్య సేవా పథకాల అమలుపై చిత్తశుద్ధి చేపలేదు. రాష్ట్ర వ్యాప్తంగా నెట్‌వర్కు ఆస్పత్రులకు ప్రభుత్వం దాదాపు రూ.3 వేల కోట్లు బిల్లులు బకాయి చెల్లించక పోవటంతో సమ్మెకు దిగాయి. గతంలోనే నెట్‌వర్క్ ఆస్పత్రులు ప్రభుత్వ దృష్టికి బిల్లుల సమస్య తీసుకు వెళ్లినా కూటమి ప్రభుత్వం స్పందించలేదు. కాగా ఉదయం నెట్‌వర్కు ఆస్పత్రులకు వచ్చిన రోగులను ఆరోగ్యశ్రీ కౌంటర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోలేదు. దీంతో రోగులు దిక్కుతోచని స్థితిలో ఉండి పోయారు. పలువురు రోగులు తిరిగి వెళ్లి పోయారు. మిగితా రోగులు ఫీజులు చెల్లించి వైద్యం చేయించుకున్నారు. పేదల కోసం ప్రవేశ పెట్టిన ఆరోగ్యశ్రీ పథకానికి ప్రభుత్వం గ్రహణం పట్టిస్తే పేద, మధ్య తరగతి ప్రజలు ఎలా బతకాలని బాధితులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.


ఆర్‌టీఐ చట్టంతో జవాబుదారీతనం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్, తదితరులు

ఉయ్యూరు: సమాచార హక్కు చట్టంతో జవాబుదారీతనం పెరిగిందని తహసీల్దార్ ఎం.సురేష్‌బాబు అన్నారు. ఇండియన్ యాక్ట్స్ అవేర్నెస్ వలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సమాచార హక్కుచట్టం–2025 వారోత్సవాల పోస్టరును రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ చట్టంతో ఎన్నో ప్రజా సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. చట్టం వచ్చి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వారోత్సవాలు జరపటం, చట్టంపై అవగాహన కల్పించటం అభినందనీ యమన్నారు. కార్యక్రమంలో యూఎఫ్ ఆర్‌టీఐ రాష్ట్ర కోకన్వీనర్ జంపాన శ్రీనివాసగౌడ్, వలంటరీ ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ సయ్యద్ లాల్ సాహెబ్, ఆర్‌టీఐ కార్యకర్తలు బేతపూడి జోగేశ్వరరావు, ఇటుకుల నాగరాజు, మరీదు సాంబశివరావు, బండి నాగసాంబిరెడ్డి, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

వార్డుల పునర్విభజనకు కౌన్సిల్ ఆమోదం



వార్డుల పునర్విభజన మ్యాప్

ఉయ్యూరు: వార్డుల పునర్విభజనకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో వార్డుల పునర్విభజనకు సంబంధించిన అంశాన్ని కౌన్సిల్ ముందుంచారు. నగర పంచాయతీగా ఉన్న ఉయ్యూరు గ్రేడ్- 2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అవ్వటంతో వార్డుల పునర్విభజన అనివార్యమని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, 20 వార్డులుగా ఉన్న ఉయ్యూరు పట్టణం 29 వార్డులకు పెరిగిందని అన్ని అంశాలూ దృష్టిలో ఉంచుకుని వార్డులను విభజించటం జరిగిందని టౌన్ ప్లానింగ్ అధికారి ఆశ తెలిపారు. సభ్యులు అందరూ ఆయా వార్డులపై చర్చించిన అనంతరం ఆమోదం తెలిపారు. సమావేశంలో కమిషనర్ జాస్తి రామారావు పాల్గొన్నారు.

వృద్ధులకోసం ప్రత్యేక నేత్ర వైద్య సేవలు

పెనమలూరు: తాడిగడప ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో వృద్ధుల కోసం ప్రత్యేక నేత్ర పరిరక్షణలో భాగంగా అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్నామని నేత్ర సంరక్షణ విభాగాధిపతి డాక్టర్ అవినాష్‌పతంగే తెలిపారు. ఈ మేరకు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవంలో భాగంగా శుక్రవారం ప్రత్యేక ఆరోగ్య సంరక్షణ అవగాహన సదస్సులో మాట్లాడుతూ వృద్ధుల్లో వచ్చే నేత్ర సమస్యల పట్ల అవగాహన కల్పించి చికిత్స అందిస్తామన్నారు. తమ వద్ద ప్రత్యేకంగా శిక్షణ పొందిన ఆఫ్తాల్మిక్ నర్సింగ్ అసిస్టెంట్‌ల ద్వారా వృద్ధులకు స్క్రీనింగ్ పరీక్షలు చేపడతామన్నారు. సరళమైన నిర్మాణాత్మకమైన పరికరాలు ఉపయోగించి వృద్ధాప్యంలో కలిగే జ్ఞాపకశక్తి లోపాలు, షోషకాహార లోపాలు, వినికిడి, దృష్టిలోపాలు, నిరాశ వంటి ముందస్తు సమస్యలకు చికిత్స అందిస్తామన్నారు. ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రిలో యట్ ది హోమ్ సేవలు కూడా కదలలేని రోగులకు అందిస్తుందని వివరించారు.

జెడ్పీ హైస్కూల్ అభివృద్ధికి 'గ్రీన్‌కో' చేయూత



హైస్కూల్‌ను సందర్శించిన గ్రీన్‌కో సంస్థసలహాదారుడు బండారు, డాక్టర్ దుట్టా

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కానుమోలులోని జెడ్పీ హైస్కూల్ అభివృద్ధికి సాయం అందిస్తామని గ్రీన్‌కో సంస్థ సలహాదారుడు, ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బండారు నరసింహారావు అన్నారు. పూర్వ విద్యార్థులు, గ్రామస్తులతో కలిసి శుక్రవారం ఆయన పాఠశాలను సందర్శించారు. కానుమోలుకు చెందిన ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభ్యుడు నూకల వీరరాఘవయ్య మునిమనుమడు, గ్రీన్‌కో సంస్థల అధినేత చలమలశెట్టి అనిల్ గ్రామాభివృద్ధికి స్వచ్ఛందంగాముందుకు రావటంపై పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. దేశ స్వాతంత్ర్యం కంటే ముందుగానే నూకల వీరరాఘవయ్య కృషితో కానుమోలులో జెడ్పీ హైస్కూల్ ఏర్పడిందని గుర్తు చేశారు. జెడ్పీ హైస్కూల్‌లో రేకుల షెడ్‌లో తరగతుల నిర్వహణ, మధ్యాహ్న భోజన తయారీ జరుగుతుండటంతో అదనపు గదులు నిర్మించాలని, ఏడు ఎకరాల పాఠశాల క్రీడాప్రాంగణాన్ని అభివృద్ధి చేయాలని గ్రీన్‌కో సంస్థ సలహాదారుడు బండారు నరసింహారావును కోరారు. ఆడిటోరియం లేదా మినీ ఫంక్షన్ హాల్ నిర్మించాలని విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించారు. త్వరలోనే పాఠశాల సమగ్ర అభివృద్ధి ప్రణాళికను రూపొందించి, గ్రీన్‌కో అధినేత చలమలశెట్టి అనిల్ సూచనల మేరకు పనులు చేపడతామని నరసింహారావు చెప్పారు. పూర్వ విద్యార్థి డాక్టర్ దుట్టా రామచంద్రరావు, చిన్నాల సత్యగణేషబాబు, చలమలశెట్టి బుచ్చిబాబు, కొండపల్లి హరిబాబు, చలమలశెట్టి శేషగిరిరావు, తోట సత్యనారాయణ పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో విద్యార్థుల ప్రతిభ

కంకిపాడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో గోసాల హెచ్‌ఎంకే విద్యార్థులు సత్తాచాటారు. వీరిని ప్రిన్సిపాల్ ఆర్.సుకుమిత్‌కౌర్, డైరెక్టర్ ఆర్. వసంత్‌కుమార్ శుక్రవారం అభినందించారు. వారు మాట్లాడుతూ పెనమలూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో భాగంగా వాలీబాల్ జూనియర్స్, సీని యర్స్ విభాగాల్లో హెచ్‌ఎంకే విద్యార్థులు రాణించారన్నా రు. జూనియర్స్ విభాగంలో ఘంటా సంధ్య, ఘంటా భవానీశ్రీ చంద్రకళ,భట్టు త్రిఫిసాగ్రేస్, భట్టు త్రిపోజాస్టేస్సీ, కనుంగుల తేజస్వి, గుంటూరు జ్వలిత, సీనియర్ విభాగంలో రాజులపాటి దీపిక, యార్లగడ్డ నిరుపమ, నందు వర్షిణి, ము రపాల అక్షయ, మాదు చంద్రహాస, దేవినేని భవ్యశ్రీ ప్రతిభ చాటారు. శిక్షణ ఇచ్చిన కోచ్ కె.రాజును అభినందించారు.

పంచాయతీలు స్వయం సమృద్ధి సాధించాలి

గన్నవరం: స్థానిక సబ్‌కోర్టు సమీపంలో గ్రామ పంచాయతీ నిధులు రూ.13.5 లక్షలతో ఏర్పాటు చేసిన క్రికెట్ బాక్స్‌ను శుక్రవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల ఆదాయం పెంచుకునేందుకు క్రికెట్ బాక్స్‌లను, ఇతర క్రీడా కోర్టులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తద్వారా ప్రభుత్వ స్థలాలను కాపాడి, యువతను క్రీడల పట్ల ప్రోత్సాహించవచ్చన్నారు. రానున్న మూడు నెలల్లో నియోజకవర్గంలో మరో 10 గ్రామాల్లో క్రికెట్ బాక్స్‌లను ఏర్పాటు చేస్తామ న్నారు. ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసయ్య, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, సర్పంచ్ నిడమర్తి సౌజన్య, మద్దినేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి



గన్నవరంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, పార్టీ నేతలు



తేలప్రోలులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న పార్టీ నేతలు



నున్న గ్రామంలో నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గన్నవరం: పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే కూటమి ప్రభుత్వ కుట్రలను ప్రజలందరూ వ్యతిరేకించాలని ఎంపీపీ అనగాని రవి పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్‌ను పార్టీ మండల అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్, వైస్ ఎంపీపీ సాతులూరి శివనాగరాజకుమారి కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పేద విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణం చేపట్టిందన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కళాశాలల నిర్మాణాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. వీటిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే కుట్రలో భాగంగా పీపీపీ విధానాన్ని తీసుకువచ్చిందన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వల్ల వైద్య విద్య పేదలకు దూరమవుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ డొక్కు వెంకన్నబాబు, మాజీ సర్పంచ్‌లు తమ్మిశెట్టి రఘుబాబు, కోట వినయ్, మాజీ ఎంపీటీసీలు కంభంపాటి సాంబశివరావు, సర్నాల ఆంజనేయులు, పార్టీ నేతలు మేచినేని బాబు, మెండెం రాంబాబు, లుక్కా ప్రసాద్, కొలుసు కిరణ్, దీపు, బర్మా శ్రీనివాసరావు, కొలుసు వెంగళరావు పాల్గొన్నారు.

తేలప్రోలు(గన్నవరం): ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు వింత శంకరరెడ్డి మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలందరూ సంతకాలు చేసి ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేయాలని కోరారు. ఎంపీపీ వడ్లమూడి సరోజిని, సర్పంచ్‌లు శ్రీరామ్, లాం నాగేశ్వరరావు, ఎంపీటీసీ తెన్నేటి నాగరాజ్, పార్టీ నేతలు వింత ఆదినారాయణరెడ్డి, తియ్యగూర రామిరెడ్డి, మాదు సాంబశివరావు, పలగాని జోజి గుండె రవి, విశ్వనాథపల్లి రవికుమార్ పాల్గొన్నారు.

బినామీలకు కట్టబెట్టే కుట్ర



హనుమాన్‌జంక్షన్‌లో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ చేపట్టిన ప్రజా ఉద్యమం వాల్‌పోస్టర్లను హనుమాన్‌జంక్షన్‌లో ఆ పార్టీ నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. పీపీపీ పేరిట ప్రభుత్వ మెడికల్ కాలేజీలను చంద్రబాబు తన బినామీలకు అప్పనంగా కట్టబెట్టేందుకు కుట్ర చేస్తున్నారని పార్టీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ ఆరోపించారు. బాపులపాడు జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, పార్టీ నాయకులు ఆవిర్నేని శేషగిరిరావు, గూడవల్లి సుధాకర్, కోడెబోయిన బాబి, కొడాలి సత్యప్రభాకర్, ఊసా జయప్రసాద్, దేవినేని కిషోర్, గుడిసే రాజు, చందు శ్రీనివాసరావు, కొమరవల్లి థామస్, మద్దాల కిన్ను, కొమర్తి సాయిరాం పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి

విజయవాడరూరల్: కూటమి ప్రభుత్వం తలపెట్టిన వైద్యకళాశాలల ప్రైవేటీకరణ వలన పేద విద్యార్థులకు తీరని నష్టం కలుగుతుందని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. నున్న గ్రామంలో మండల వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. తొలుత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నాయకులు నివాళులర్పించారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు శీలం రంగారావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 వైద్యకళాశాలలను కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరు చేయించి నిర్మించారన్నారు. 40 సంవత్సరాల రాజకీయ అనుభవం కలిగిన సీఎం చంద్రబాబు వైద్య కళాశాలలను ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను వైఎస్సార్ సీపీ కోటి సంతకాల కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి తీసుకెళుతుందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ తీరుతో ప్రజలు నష్టపోతున్నారని అన్నారు. అనంతరం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్‌వీఆర్, మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పోలారెడ్డి ప్రసాద్‌రెడ్డి, బొంతు సరోజిని, పి.గిరిజాకుమారి, పి.రవీంద్ర, దూరు రత్నం, బల్లెం సునీత, దివ్యాంగుల విభాగం ప్రతినిధి బందెల కిరణ్‌రాజ్, జిల్లా కార్యదర్శి సమ్మెల సాంబశివరావు, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ తగరం రవీంద్ర, నున్న, పాతపాడు, అంబాపురం, గ్రామ కన్వీనర్లు పోలారెడ్డి చంద్రారెడ్డి, కలపాల అబ్రహాం, నల్లమోతు చంద్రశేఖర్, పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉంగుటూరు(గన్నవరం): ఉంగుటూరు మండలం నందమూరు సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీబీ. శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేమండ, నందమూరు, మానికొండ, చాగంటిపాడు, చికినాల, బొకినాల, మదిరిపాడు పరిధిలో వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. కేవలం ఉదయం 4 నుంచి 7 గంటల వరకు మాత్రమే విద్యుత్ సరఫరా ఉంటుందని రైతులు గుర్తించాలని సూచించారు. **గన్నవరం**: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ మెయింటినెన్స్ వర్క్స్, విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వాహక ఇంజినీర్ పి.హరిబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గన్నవరం మొత్తం ఏరియా, మర్లపాలెం, చిన్నఅవుటపల్లి, దుర్గాపురం, ఎయిర్‌పోర్ట్ సిటీ, స్లేట్ స్కూల్, గొల్లనపల్లి, బీబీ.గూడెం ప్రాంతాలకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

కంకిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో ఈనెల 11న విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ గుణదల ఈఈ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంకిపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ, మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ కంకిపాడు, పునాదిపాడు, గొడవర్రు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు.

పెనమలూరు: మండల పరిధిలో ఐదు గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పి.హరిబాబు తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ పెనమలూరు సెక్షన్‌లో గంగూరు సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుతామన్నారు. ఈ కారణంగా పెనమలూరు, గంగూరు, గోసాల, వణుకూరు, చోడవరంలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పోరంకి–తాడిగడపలో..

పోరంకి, తాడిగడప సెక్షన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుంద న్నారు. తాడిగడప విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. నాగార్జున, భాగ్యనగర్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంగటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుతామన్నారు. దీని కారణంగా గుమ్మడితోట, వాటర్ ట్యాంక్‌రోడ్డు, వికసితనగర్, కెనడీ స్కూల్, సెంట్‌థెరీసా స్కూల్, చలసానినగర్, ఉమాశంకర్‌నగర్, పంటకాలువ రోడ్డు, కామయ్యతోపు, బందరు రోడ్డు, ఎండోమెంట్ కాలనీ మైత్రీనగర్, వృద్ధుల ఆశ్రమం రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని స్థానికులు సహకరించాలని కోరారు.

విధుల నుంచి ట్రాక్టర్ డ్రైవర్ తొలగింపు

సాక్షి స్పందన

పెనమలూరు: గంగూరు గ్రామ పంచాయతీలో చెత్త ట్రాక్టర్ డ్రైవర్ నందిపాముల జోసెఫ్‌ను విధుల నుంచి తొలగించామని గ్రామ పంచాయతీ కార్యదర్శి వీఎస్.ప్రకాష్‌నాథ్ శుక్రవారం తెలిపారు. సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురించిన 'గంగూరులో హడలెత్తిస్తున్న చెత్త ట్రాక్టర్' కథనంపై అధికారులు వెంటనే స్పందించారు. ట్రాక్టర్ డ్రైవర్ మద్యం తాగి విధులకు హాజరైనట్లు గుర్తించామని ఈవో తెలిపారు. దీంతో డ్రైవర్‌ను విధుల నుంచి తొలగించి అతని స్థానంలో మరో డ్రైవర్‌ను నియమించామన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకున్నామని ఈవో వీఎస్.ప్రకాష్‌నాథ్ తెలిపారు.

కొత్త జీఎస్టీ మేరకే ఎలక్ట్రానిక్స్ వస్తువుల విక్రయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలులోకి తీసుకువచ్చిన జీఎస్టీ 2.0 ప్రకారం ఎలక్ట్రానిక్స్ పరికరాల కొనుగోళ్లపై పన్నులు గణనీయంగా తగ్గిందని డెప్యూటీ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ ఎం.సునీత చెప్పారు. స్థానిక విజయవాడరోడ్డులోని మారుతి ఎలక్ట్రానిక్స్ వద్ద వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో 'సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ)పై కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సవరణలతో గతంలో 28 శాతం శ్లాబు ఉన్న ఎల్‌ఈడీ టీవీ, ఏసీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్లు, తదితర ఎలక్ట్రానిక్ పరికరాలు, గృహోపకరణాలపై 12 శాతం మాత్రమే జీఎస్టీ అమలవుతుందని చెప్పారు. దీనికి అనుగుణంగా వ్యాపారులు అమ్మకాలు సాగించాలని డీసీటీవో సునీత సూచించారు. ఏసీటీవో ఎ.బద్రీనాథ్, మారుతి ఎలక్ట్రానిక్స్ అధినేత మత్తి రాంబాబు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

పెనమలూరు: తాడిగడప గ్రామంలో యువకుడు అదృశ్యమైన ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప వసంతనగర్ కాలువ కట్టకు చెందిన పెనుమాక కోటేశ్వరరావుకు ముగ్గురు పిల్లలు. అయితే అతని పెద్ద కుమారుడు పెనుమాక ఫణిదుర్గ (24) మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతను ఈ నెల 7వ తేదీనఇంటి నుంచి కనిపించకుండాపోయాడు. వెతికినా అతని ఆచూకీ తెలియలేదు. తండ్రి కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.